క్లుప్తంగా

నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ


కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ఈనెలాఖరులోగా చెల్లించి 5 శాతం రాయితీని పొందాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పట్టణ ప్రజలను కోరారు. పూర్తిస్థాయి పన్నులు చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ నెలాఖరు వరకే ఈ అవకాశం కల్పిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండిక వచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు పట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. సోమవారం అమావాస్య కావడం, మంగళవారం ఉగాది పర్వదినం కావడంతో దర్గాలో జరిగే పంచాంగ శ్రవణం వినడానికి భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో గడిపారు. కొందరు దర్గా పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు.


సారా స్థావరాలపై దాడులు.. ఇద్దరి అరెస్ట్

- 150 లీటర్ల సారా, ఆటో స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఆదోని రూరల్: దిబ్బనకల్ గ్రామ సమీపంలోని వలమప్పకొండ వద్ద సారా స్థావరాలపై సోమవారం దాడులు చేసినట్లు రూరల్ సీఐ జి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. 150 లీటర్ల సారా, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే 1000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా తయారీపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎస్‌ఐలు ఎర్రి స్వామి, శ్రీనివాసులు, చిన్న పీరయ్య పాల్గొన్నారు.

సింగిల్ విండో కార్యదర్శి మృతి


లక్ష్మయ్య (ఫైల్)

కౌతాళం: మండలంలోని బదినేహాల్ సహకార పరపతి సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్న లక్ష్మయ్య (25) గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. లక్ష్మయ్యకు ఛాతి నొప్పి రావడంతో ఆదోనికి తరలించారు. అక్కడ చికిత్స అందించే లోపు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మయ్యకు భార్య ఉశేనమ్మ, కుమార్తె ఉన్నారు. కాగా భార్య ప్రస్తుతం 9నెలల గర్భిణీ. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు వీరభద్రగౌడ్, లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితయగౌడ్, మండల కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రగతి వికాసం

ధ్వంసమైన రోడ్లు.. పడిపోయిన ఇళ్లు.. కనీస వసతులు కరువు.. అంతంత మాత్రంగా పంటలు.. ఇదీ ఐదేళ్ల క్రితం వరకు పల్లెకు నిర్వచనం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. గ్రామాలకు బీటీ రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, డ్రైనేజీలు, మంచి నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్లు, బడుల్లో లక్షలాది రూపాయలతో వసతుల కల్పన, వైద్యశాల, పాలన కోసం గ్రామ సచివాలయం, ఆర్బీకే, గోదాములు తదితర భవనాల నిర్మాణం.. వ్యవసాయం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి నీటి సరఫరా.. ఇక పేదల అభ్యున్నతికి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసింది. దీంతో గ్రామాల్లో ప్రగతి పరుగులు తీస్తుండటంతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

- అభివృద్ధి పథంలో కందుకూరు
- గడప గడపకు సంక్షేమ ఫలాలు
- రూ.11.63 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- డీబీటీ, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.31.72 కోట్ల లబ్ధి
- సంతోషంగా పల్లెవాసులు


నిర్మాణంలో ఉన్న సచివాలయం

కోసిగి : మండలంలోని కందుకూరు గ్రామం ఐదేళ్ల జగనన్న పాలనలో అభివృద్ధిలో దూసుకుపోతోంది. కర్నూలు జిల్లాలోనే మారుమూల ప్రాంతం, తుంగభద్ర నది ఒడ్డున ఉన్న కందుకూరు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సమృద్ధిగా నిధులు కేటాయింపజేయించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టడంతో మండలంలోని అన్ని గ్రామాల కన్నా సంక్షేమాభివృద్ధిలో ముందువరసలో నిలిచింది. కందుకూరు గ్రామ సచివాలయ పరిధిలోని కందుకూరు, కామన్‌దొడ్డి, కడదొడ్డి, లక్ష్మీనగర్ క్యాంప్‌లు ఉన్నాయి.

అభివృద్ధి పనులు..

- రూ.11.63 కోట్లతో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు పూర్తి కావచ్చాయి, లిఫ్ట్ స్కీమ్ ఏర్పాటు చేసి పంపింగ్ చేయాల్సి ఉంది. ఇది అందుబాటులోకి వస్తే కందుకూరు గ్రామంలో 1300 ఎకరాలు సాగులోకి వస్తాయి.
- రూ.1.50 కోట్లతో కామన్‌దొడ్డి గ్రామం నుంచి కందుకూరు వరకు 4 కిలోమీటర్లు తారు రోడ్డు వేయించారు.
- కందుకూరు క్రాస్ రోడ్డు నుంచి తుంగభద్ర నది వరకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డు, మరో రూ.20 లక్షలతో రామలింగేశ్వర స్వామి ఆలయం ముందు భాగంలో సీసీ రోడ్డు వేయించారు.


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- రూ.1.93 కోట్లతో నాడు–నేడు కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 అదనపు గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- కందుకూరు గ్రామంతో పాటు చుట్టు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశారు. గతంలో మండల కేంద్రం కోసిగిలో మాత్రమే ఉండేది. గ్రామంలో ఆసుపత్రి ఏర్పాటుకు రూ.2కోట్లు మంజూరు చేశారు.
- రూ.4లక్షలతో సచివాలయం, రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.
- రూ.10 లక్షలతో పాఠశాలకు ప్రహరీ నిర్మించారు.
- ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.73 లక్షలు మంజూరు చేయగా.. పనులకు శ్రీకారం చుట్టారు.
- రూ.80 లక్షలతో పంట దిగుబడులు నిల్వ చేసేందుకు రెండు గోడౌన్‌లు ఏర్పాటు చేశారు.
- రూ.50 లక్షలతో గ్రామంలోని కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించారు.
- ఎమ్మెల్యే గ్రాంటు కింద 7 బోర్లు వేయించారు. 12 తాగునీటి మిని ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు.
- 280 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. మరో 90 జగనన్న పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చారు.

సంక్షేమ పథకాల వివారాలు (డీబీటీ)..		
పథకం	లబ్ధిదారుల సంఖ్య	అందిన మొత్తం
1. అమ్మ ఒడి	648	రూ.2,90,27,055
2. విద్యా దీవెన	148	రూ.25,27,449
3.వసతిదీవెన	94	రూ.19,16,512
4. రైతు భరోసా	703	రూ.3,34,03,600
5. ఉచిత పంటల బీమా	642	రూ.1,01,48,606
6. రైతులకుసున్నావడ్డీరుణాలు	162	రూ.4,65,561
7. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	58	రూ.7,09,300
7. పెన్షన్ కానుక	533	రూ.5,12,55,750
8. వైఎస్సార్ చేయూత	303	రూ. 1,38,75,000
9. వైఎస్సార్ ఆసరా	701	రూ.2,21,34,954
10. వైఎస్సార్ సున్నా వడ్డీ	969	రూ.39,54,181
11. ఈబీసీ నేస్తం	3	రూ.90,000
11. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	124	రూ.43,40,363
12. ఆరోగ్యఆసరా	71	రూ.5,10,950
13. హౌసింగ్	154	రూ.1,59,71,017
14. వైఎస్సార్ బీమా	9	రూ.8,20,000
15.వాహనమిత్ర	4	రూ.60,000
17. జగనన్న చేదోడు	34	రూ.6,80,000
18.కోవిడ్ సహాయం	1,180	రూ.11,80,000
19.జగనన్నతోడు(వడ్డీ)	39	రూ.25,792
పరోక్ష ప్రయోజనాలు (నాన్‌డీబీటీ)		
20.ఇళ్ల స్థలాల భూసేకరణ ఖర్చు	239	రూ.1,35,54,000
21. విద్యాకానుక	656	రూ. 50,79,312
22. జగనన్న తోడు (రుణాలు)	71	రూ.15,21,,949
23. 8వతరగతికి ట్యాబ్‌లు	76	రూ.10,31,316
24. జగనన్న గోరుముద్ద	633	రూ.62,32,551
25. వైఎస్సార్ సంపూర్ణ పోషణ	390	రూ. 74,54,540
26. ఇంటింటికీ రేషన్		
(79.80లక్షల టన్నులు)	1290	రూ.2,51,75,700
మొత్తం		రూ.31,72,02,790

గ్రామ రూపు రేఖలు మారాయి



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత మా గ్రామ రూపు రేఖలు మారిపోయాయి. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించారు. ఇది పూర్తయితే దాదాపు 1300 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పుష్కలంగా రెండు పంటలు పండించుకోవచ్చు. గ్రామంలోనే ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అన్ని రకాల సేవలతో గ్రామస్తులంతా సంతోషంగా ఉన్నాం. – బిట్టన గౌద, కందుకూరు

పరిపాలన బాగుంది



వైఎస్సార్‌సీపీ పాలన బాగుంది. గతంలో చిన్న పనికి కూడా గ్రామం నుంచి 15 కి.మీ. దూరంలోనున్న మండల కేంద్రం కోసిగికి వెళ్లాల్సి వచ్చేది. గతంలో గ్రామానికి రోడ్డు కూడా బాగా లేకుండింది. ఇప్పుడు రోడ్డు వేయించారు. సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య సేవలు గ్రామంలో అందుతున్నాయి. గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ రావడం ఆనందంగా ఉంది. చాలా మంచి పనులు చేశారు. – తాయన్న , కందుకూరు


కామన్‌దొడ్డి నుంచి కందుకూరు వరకు వేసిన తారు రోడ్డు

ఆదోనికి నీటి కష్టాలు లేనట్లే

- బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో పుష్కలంగా తాగునీరు
- 65 రోజులకు సరిపడా నీటి నిల్వ



401.50 అడుగులకు ఉన్న నీటి నిల్వ, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నీటి సంపు


ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో మరో రెండు నెలలపాటు తాగునీటికి కొరత లేదు. తుంగభద్ర జలాశయం నుంచి పంపింగ్ అవుతున్న రా వాటర్‌ను చెరువులోకి నింపుకోవడంలో అధికారులు సఫలీకృతులయ్యారు. దీంతో ఆదోని పట్టణానికి తాగునీటి సమస్య ఉండదని చెప్పవచ్చు. ఏప్రిల్, మే మాసాలకు సరిపడే నీరు ఉంది. జూన్ మొదటివారంలోనే వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో తాగునీటి సమస్యకు ఢోకా లేదు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని బసాపురం ఎస్ఎస్ ట్యాంకులోకి తుంగభద్ర దిగువ కాలువ నుంచి రా వాటర్‌ను పంపింగ్ చేస్తారు. ఈనెల 12వ తేదీ వరకు కెనాల్‌లో రా వాటర్ సరఫరా జరుగుతుంది. అంతలోగా ఎస్ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపుకునేందుకు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఉండరాదని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నట్లు ఎంఈ చలపతిరావు తెలిపారు. ఈనెల 12వ తేదీ తర్వాత నాలుగైదు రోజులపాటు కెనాల్‌లో క్రాస్ బండను ఏర్పాటు చేస్తామని, వారం రోజులకు సరిపడేంతగా నీరు నిల్వ ఉంటాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 401.50 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఈ నీరు 65 రోజులకు సరిపోతాయని వాటర్ వర్క్స్ అధికారులు చెబుతున్నారు. అంతలో జూన్ మాసం వస్తుందిని.. వర్షాలు కురిస్తే నీటి సమస్యకు ఇబ్బంది ఉండదని అంటున్నారు.

రోజుకు 25 మిలియన్ లీటర్లు

ఆదోని పట్టణంలో 3 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. ఈ జనాభాకు సరిపడేంతగా రోజుకు 25ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో తాగునీటికి కొరత లేదు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ఆదోని మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను పూర్తిగా నియంత్రించేందుకు ఎస్ఎస్ ట్యాంకు సమీపంలో కొత్తగా ఆరు బోర్లు వేశారు. మూడు బోర్లలో 3 ఇంచులకు పైగానే నీరు పడ్డాయి. ఒక బోరులో రెండున్నర ఇంచులు, మరో రెండు బోర్లలో ఒకటిన్నర ఇంచు చొప్పున నీరు పడ్డాయని ఎంఈ చలపతిరావు తెలిపారు. బోర్లకు సంబంధించి 15వ ఆర్థిక ఫైనాన్స్ కింద రూ.25 లక్షలు ఖర్చు చేసి మోటార్లను కొనుగోలు చేశామని, త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు బోర్లతో చెరువులోకి నీటిని పంపింగ్ చేయనున్నట్లు తెలిపారు.


తుంగభద్ర దిగువ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ అవుతున్న రా వాటర్

నీటి కొరత ఉండదు



వేసవిలో ఆదోని పట్టణానికి తాగునీటి కొరత ఉండదు. ఆ దిశగా చర్యలు తీసుకున్నాం. కొత్తగా ఆరు బోర్లు వేశాం, తుంగభద్ర దిగువ కాలువలో నీటి సరఫరా జరుగుతోంది. కాలువల నుంచి చెరువులోకి నీటి పంపింగ్ కొనసాగిస్తున్నాం. పూర్తిస్థాయిలో చెరువును నింపుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా నీటిని సరఫరా చేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – చలపతిరావు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

రేపటి నుంచి ఆరోగ్య సురక్ష

–డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

ఆదోని సెంట్రల్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి సోమవారం తెలిపారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తొలుత పట్టణంలోని శంకర్‌నగర్, షరాఫ్ బజార్‌లో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న క్రమంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకపోవడం మంచిదన్నారు. ఎండలో తిరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగతో పాటు నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. జ్వరం, అనారోగ్య సమస్యలు ఉన్న వారు డాక్టర్ల సూచనల మేరకు జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు.

35 మంది వలంటీర్లు రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో సోమవారం 35 మంది వార్డు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా ప్రతులను వార్డు అడ్మిన్‌లకు అందజేశారు. అడ్మిన్‌లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు అందజేశారు. 24వ వార్డులో కృపావతి, మానస, ఉషారాణి, పూజ, సంధ్య, లక్ష్మీదేవి, శ్రీలక్ష్మి, అఖిల్‌బాబు, అరవింద్, ఇందూజ రాజీనామా చేశారు. అలాగే 40వ వార్డులో విజయ, భవానీ, సాయికృష్ణ, సుదీర్, గౌరమ్మ, శ్రావణిభాయి, వినయ్, సాగర్, సరస్వతి, గణేశ్, రవికుమార్ ఉన్నారు. 15వ వార్డులో కె.లక్ష్మి, 21వ వార్డులో వంశీ, కవిత, అశోక్, యాస్మిన్, సాయిప్రియ, దీప్తి, రేణుక, శాంతి, ఉషాప్రియ, 12వ వార్డులో రాధిక, మహేష్, వీరశేఖర్, గుల్జార్‌బేగం రాజీనామా చేశారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న వైద్యులు మనోజ్ కుమార్, రజిత

కోసిగి: ఎండలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మనోజ్ కుమార్, రజిత సూచించారు. 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళనకరమన్నారు. పగటి వేళల్లో అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని చెప్పారు. నీళ్లు, మజ్జిగ తరచుగా తీసుకోవాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ను నీళ్లలో కలుపుకుని తాగితే ఎండ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. మండలంలోని ప్రతి గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

కౌతాళం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని కౌతాళం కెనరా బ్యాంకు మేనేజర్ మల్లికార్జున అన్నారు. మండలంలోని బాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో సూమారు రూ.30 వేల విలువజేసే క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే సీఎస్ఆర్ కార్యక్రమం కింద తమ బ్యాంకు బాపురం ఉన్నత పాఠశాలను ఎన్నుకుని క్రీడా పరికారాలను అందజేసినట్లు చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

కోసిగి: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సూచించారు. సోమవారం పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులతో ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి గంటకోసారి నీరు తప్పనిసరిగా తాగాలన్నారు. అలాగే రోడ్లపై ఫాస్ట్ ఫుడ్, తినుబండాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమన్నారు. చిరుధాన్యాలు, ఆకు కూరగాయాలు, పండ్లు, అధిక సంఖ్యలో తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, స్కాట్స్ టీచర్ రాజేశ్వరి, పీజీటీ సందర్ కుమార్ ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం నారాయణపురం వద్ద బైక్‌పై తరలిస్తున్న 760 టెట్రా ప్యాకెట్లు సాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. రాయచూర్ జిల్లా కటకనూరు గ్రామానికి చెందిన నరసింహులును అరెస్టు చేశమన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు


దర్శనానికి క్యూలో భక్తులు


పూజలందుకున్న ఈరన్నస్వామి మూలవిరాట్

కౌతాళం: అమావాస్య సందర్భంగా ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండివంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులు నడిపారు. ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం సోమవారం అమావాస్య కావడంతో భక్తుల సందడి నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు ఇక్కడికి కూడా క్యూకట్టారు. అలాగే తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి కూడా భక్తులు అధికంగా చేరుకొని పూజలు చేశారు. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు వచ్చారు.

నేడు ఉరుకుందలో పంచాంగ శ్రవణం

ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం దేవస్థాన అనివేటి మండపంలో ఉదయం 10గంటలకు దేవస్థాన అర్చకులు, ఆలయ సిబ్బంది సమక్షంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తామని ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.